# కల్పనలకుండాలి బరువూ, లోతూ ...

ప్రజాస్వామ్యపత్రికలయుగంలో పాఠకులే పాలకులు. వారిఅభిప్రాయాలమీద రచయితలకి గౌరవం వుండాలి. వుంటుంది కూడాను. కాని ఒక్కోప్పుడు మాత్రం గందరగోళంగా వుంటుంది. అలాటప్పుడు ఏం జరుగుతుందంటే ...

ఈమధ్య ఒక యువరచయిత్రి కథకి వస్తువు ముఖ్యమా, కథనం ముఖ్యమా అని అడిగింది నన్ను. అపుడు నేను గంభీరంగా ఊపిరి తీసుకుని కథలు రకరకాలు అంటూ ఒకదంపుళ్లపాట అందుకోబోయాను. వెంటనే గుర్తొచ్చింది నేను ఇంతకుముందు రాసిన వ్యాసమూ, తిన్నచీవాట్లూను. అంచేత, అలా బోరుకొట్టే వ్యాసాలు మానేసి, వూరికే పోచికోలు కబుర్లు చెప్పి పబ్బం గడుపేసుకున్నాను.

అవేమిటంటే ...

ఓసారి నాకథ ఏపత్రికలోనో కనిపించినతరవాత నాకూ మామామయ్యకీ జరిగిన సంభాషణా, మాఅమ్మ తీర్పూ ..

‘‘ఇదిగో కనకమహాలక్ష్మీ, కథల్లో ఇన్ఫర్మేషను రియలిస్టిగ్గా వుండాలా అక్కర్లేదా?’’

‘‘వుండాలి.’’

‘‘మరి విశాఖఎక్స్‌ప్రెస్ పొద్దున్న పదిగంటలకి వస్తుందని రాసావేం? నీమాట నమ్ముకుని ఆరుగంటలకే వెళ్లి కూర్చున్నాను స్టేషనులో. అది మధ్యాన్నం నాలుగ్గంటలదాకా రాలేదు.’’

‘‘నాకథకోసం అలా రాయవలసివచ్చింది.’’

‘‘కావలిస్తే కథ మార్చుకో. అంతేగాని అలా తెలిసీతెలీని రాతలు రాయకు. రైల్వే గైడు చూసి సరిగ్గా రాయి నెక్స్ట టైము. అసలు మన రచయిత్రులింతే. సరిగ్గా ఏదీ తెలుసుకోరు.’’

మా అమ్మ తీర్పు:

‘‘నేనందుకే చెప్పేను, దానికథలు చదవకు. రైల్వేగైడు కొనుక్కు చదువుకోమని’’.

ooo

కిందటేడు ఇండియా వెళ్లినప్పుడు ఓపాత స్నేహితురాలు కమ్ రచయిత్రిని కలిసాను.

మాటలసందర్భంలో "ఏమేనా కొత్తకథలు రాసావా?"అని అడిగాను.

"మొదలెట్టాను కాని సాగడం లేదు."

"ఏం?"

"పాఠకుల ప్రశ్నలు చూస్తే భయంవేస్తోంది. నువ్వూ చూస్తున్నావు కదా. ఆయనెవరో నీకు ముగ్గురు పిల్లలు కదా, కథలో ఇద్దరే అని రాసావు. పిల్లలు నొచ్చుకోరూ అని కోప్పడ్డారు. మరో కత. ఆవిడకి పచ్చచీరంటే ఇష్టం. ఆయనకి వంకాయకూరంటే ప్రాణం. ఓరోజు ఆయన చిలకాకుపచ్చ చీర తెచ్చాడు. ఆవిడ గుత్తివంకాయకూర చేసింది. ఆవిడచీర చూసి మూతిముడుచుకుంది. ఆయన కూర పక్కకి తోసేసి లేచిపోయాడు. మరీ అది కథ అవునా కాదా?"

"బాగానే వుంది, భేతాళుడిప్రశ్నలా. దానికి ముందు, అంటే మొదటిచీరకీ ముప్ఫయ్యో చీరకీ మధ్యన, అలాగే మొదటిరోజుకూరకీ తొమ్మిదోరోజు చేసినకూరకీ మధ్య ఏం జరిగిందన్నదాన్నిబట్టి వుంటుంది. పోతే ఎవరు రాశారు అన్నదాన్నిబట్టి కూడా వుండచ్చు" అన్నాను గోడమీద పిల్లివాటంగా. ఆమీదట నేనే అడిగాను. "ఏం కథ రాద్దాం అనుకుంటున్నావు?"

"చావు గురించి."

"బాగానే వుంటుంది." అని మళ్లీ మామామయ్యమాటలు గుర్తొచ్చి, "కాస్త రిసెర్చి చేసి రాయి," అని ఓసలహా కూడా ఇచ్చాను.

"నేనూ అదే విన్నాను, కాని రిసెర్చి అంటే వారూ వీరూ శలవిచ్చినవే కదా. వారు కూడా స్వానుభవంతో చెప్పినవి కావు కదా." అంది.

"లేదులే. రామారావుగారూ, సరస్వతీదేవిగారూ రాశారుకదా."

"వారి కథలు పోయినవారు పోగా మిగిలినవారు పడే అవస్థలు. నేను రాయబోయేది చనిపోయినవాడికథ. అంటే చనిపోయినవాడు ఏం అనుకుంటున్నాడు, ఏంచేస్తున్నాడు లాటివి."

నాకేం తోచలేదు. గొప్పచిక్కే వచ్చిపడింది.

“మరేం చేస్తావు?”

“చచ్చిపోవాలేమో,” అంది.

“చచ్చిపోయింతరవాత ఎలా రాస్తావు? అక్కడ కాయితాలూ, కంప్యూటర్లూ వుంటాయో వుండవో, రాసినకథ పంపడానికి తపాలావసతులు వుంటాయో వుండవో”

“అది తెలుసుకోడానికేనా చచ్చిపోవాలి కదా.”

నాకు గుండెలు గుభేలుమన్నాయి. నేరకపోయి అడిగానేమో అనిపించింది.

“అదేం మాటే. చూడముచ్చటయిన సంసారం. రత్నమాణిక్యాల్లాటి బిడ్డలూ, అదేం ఆలోచనే” అన్నాను గాభరా పడిపోతూ.

“మరి చావుగురించి ఎలా తెలుసుకోవడం?” అంది.

రాను రాను గడ్డుసమస్య అయిపోతోంది.

“మరో సందేహం. ప్రాణాలతోనే వున్న కుక్కలూ, గాడిదలగురించి కూడా మనకి చాలా సాహిత్యం వుంది కదా.  నీవున్ కవివి కావు కద అని ఆయనెవరో కొండవీటి గాడిదని అడినప్పుడు మరి ఆయన గాడిద భాషా సంస్కృతులు తెలుసుకునే అడిగారా? అప్పట్లో యూనివర్సిటీలు అలాటి కోర్సులిచ్చేవా?”

“ఇచ్చేవేమో. వాళ్లందరూ గాడిదలసాంప్రదాయాలు క్షుణ్ణంగా చదువుకున్నారేమో,” అన్నాను. అంతకన్న ఏంచెప్పను?

“చావుమీద కథ రాయడం కోసం చావలేను. గాడిదమీద రాయడానికి గాడిదని కాలేను. మరి నాకు పాలకులనలరించే రచయిత్రినయే యోగంలేదు కాబోలు,” అంది నానేస్తం నీరుగారిపోతూ.

నాకు ఎనలేని జాలి ముంచుకొచ్చింది. ఆడువారు మంచికథకులు కాలేకపోవుటకు కారణములు అంటూ ఓ వ్యాసం రాసెయ్యాలనిపిస్తోంది.  ...

ooo ooo

(యుపాధ్యాయుల సూర్యకుమారి రైల్వే టైమ్స్ గురించి ఇలాటివాక్యం రాసినరాసినట్టు గుర్తు.

జులై 2007, మాలతి)